నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు

- ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం
- విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహణ, బహుమతుల ప్రదానం



రాజంపేట టౌన్‌ విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్‌ డాక్టర్‌ పురుషోత్తం

రాజంపేట టౌన్‌ : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోగలరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ బి.పురుషోత్తం, మన్నూరు సీఐ కుళ్లాయప్ప, కార్పొరేట్‌ వ్యవహారాల మంత్రిత్వశాఖ డైరెక్టర్‌ రవి శంకర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం (మై భారత్‌) సహకారంతో వికసిత ఫౌండేషన్‌ చైర్మన్‌ శూలం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు తాము ఎంచుకున్న చదువు, కోర్సుల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. రానున్నది డిజిటల్‌ యుగమని విద్యార్థులు అందుకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సమయం వృథా చేసుకొని కాలేజీ జీవితాన్ని కాలక్షేపంలా గడిపేస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. డిగ్రీ ఫైనలియర్‌ చదివే విద్యార్థులు మరో నాలుగైదు సంవత్సరాల్లో జీవితంలో స్థిరపడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పిజిలో సీటు సాధించేందుకు ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. చదువుకునేంత వరకు తల్లిదండ్రులను డబ్బులు అడిగినా పర్వాలేదని, చదువు పూర్తయ్యాక తల్లిదండ్రులపై ఆధారపడకుండా జీవించాలని సూచించారు. చదువు పూర్తయిన మరుసటి రోజు నుంచే ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వెతుకులాట ప్రారంభించాలని తెలిపారు. తొలుత కొద్దిపాటి వేతనం, సంపాదనతో ఉద్యోగం కాని ఉపాధి అవకాశం కాని దొరకవచ్చని అయితే వేతనం లేక సంపాదన తక్కువ అని వచ్చిన అవకాశాలను మాత్రం వదులుకోవద్దని తెలిపారు. ఇదిలావుంటే ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో



సిద్దవటం: నైపుణ్య అభివృద్ధి ఆవశ్యకతను తెలియజేస్తున్న ప్రిన్సిపల్‌ సమీర్‌ బాషా

గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ ప్రిన్సిపల్‌ వెంకటనరసయ్య, వికసిత ఫౌండేషన్‌ చైర్మన్‌ శూలం లక్ష్మీదేవి, మహిళా విభాగం కో–ఆర్డినేటర్‌ పార్వతి, తెలుగు అధ్యాపకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలమంతా డిజిటల్‌మయమే

సిద్దవటం : మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సమీర్‌ బాషా మాట్లాడుతూ ఈనాటి విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమేకాదు, వృత్తి నైపుణ్యాలను కూడా పొందాలన్నారు. ఆటోమోటివ్‌, రిటైల్‌ వంటి ఒకేషనల్‌ కోర్స్‌ ద్వారా విద్యార్థులు చిన్న వయస్సులోనే ప్రాక్టికల్‌ నాలెడ్జ్‌, సెల్ఫ్‌ కాన్ఫిడెన్స్‌ సంపాదిస్తారన్నారు. రాబోవు రోజుల్లో ఏ1, (ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌), రోబోటిక్‌, డిజిటల్‌ టెక్నాలజీ కారణంగా వ్యాపారాలు, ఉద్యోగాలు మారిపోతున్నాయి కాబట్టి ప్రతి విద్యార్థి ఒక నైపుణ్యాన్ని నేర్చుకుని జీవనోపాధిని పటిష్టం చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు యూనస్‌, రవి శంకర్‌, పోతులూరయ్యలు మాట్లాడుతూ చైనాలో తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి నైపుణ్యాలతో పెంచుతారని, 10 సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికీ పిల్లలు వాళ్ల కాళ్ల మీద వారు నిలబడే విధంగా వారిని తీర్చి దిద్దుతారన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్‌ టీచర్స్‌ షేక్‌ మౌలాలి, హేమంత్‌, ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, సిరాజుల్లా, నరసింహులు, రమణయ్య, రాజమ్మ, పరమేశ్వరి, సుమతి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సభలు



రాజంపేట : ఈనెల 17 నుంచి రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి నేతృత్వంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈమేరకు రాజంపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మండల స్థాయిలో జరిగే సభలు విజయవంతం చేయాలని పార్టీ క్యాడర్‌కు ఆయన పిలుపునిచ్చారు. 17న ఉదయం వీరబల్లి మండలం, సాయంత్రం టి.సుండుపల్లె మండలంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18న రాజంపేట మున్సిపాలిటీ, రూరల్‌ మండలాల ఉంటాయన్నారు. 18న సాయంత్రం నందలూరులో ఉంటుందన్నారు. 19న ఉదయం ఒంటిమిట్ట మండలం, సాయంత్రం సిద్దవటం మండలంలో సభలను నిర్వహించనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నవోదయలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చక్రేనాయక్‌ తెలియజేశారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూలై 29వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవచ్చన్నారు.

సుబ్రమణ్యేశ్వరుడికి అభిషేకాలు

నందలూరు : రైల్వేకేంద్రంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని శ్రీ సుబ్రమణ్య స్వామికి మంగళవారం అర్చకులు సరసా రవికుమార్‌ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం అభిషేకం పూజలు జరిగాయి. భక్తులు స్వామివారికి పాలతో అభిషేకం చేసి పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పాఠశాలల వద్ద దుకాణాలు తనిఖీ

సిద్దవటం : పాఠశాలలకు వంద మీటర్ల దూరంలోని దుకాణాల్లో ధూమపానం వంటివి అమ్మకూడదని దుకాణాదారులకు మంగళవారం తనిఖీలు చేసి అవగాహన కల్పించామని ఎస్‌ఐ మహమ్మద్‌ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు దగ్గరలో అంటే వంద మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలలో ఇక మీదట బీడీ, సిగరెట్‌, పొగాకు, రాజా, ఖైనీ, గుట్కా, మిరాజ్‌ వంటి వాటిని దుకాణాలలో విక్రయించకూడదని ఆయన హెచ్చరించారు. మరో సారి దుకాణాలను తనిఖీ చేసినప్పుడు ధూమపానం వంటివి ఉన్నట్లయితే అట్టివారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని ఎస్‌ఐ అన్నారు.

రైతు సంఘం అధ్యక్షుడిగా నవీన్‌కుమార్‌రెడ్డి



ఎన్నికైన నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వంగిమళ్ల రంగారెడ్డి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్‌) : ఏపీ రైతు సంఘం జిల్లా నూతన కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రామాపురంలో ఎన్నుకున్నారు. కమిటీకి అధ్యక్షులుగా నవీన్‌ కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా అన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్‌బాషా, ఉపాధ్యక్షుడుగా అన్వర్‌, సహాయ కార్యదర్శిగా నాగయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేయాలన్నారు. రబీ సీజన్‌లో రైతులు ఘోరంగా నష్టాలు పాలయ్యారన్నారు. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమైనా ఇంత వరకు వర్షపు జాడ కనపడటం లేదని ఈ సీజన్‌లోనూ రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా రైతులకు సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాయచోటి ఏరియా అధ్యక్షులు హరినాధరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందచేస్తున్న క్లబ్‌ సభ్యులు

వీరబల్లి : మానవ సేవే.. మాధవసేవ అని రాయచోటి లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు శ్యామ్‌ తెలిపారు. మంగళవారం వీరబల్లి మండల కేంద్రంలో ఉన్న మోడల్‌ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి విద్యా మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విద్యా మెటీరియల్స్‌ను వీరబల్లికి చెందిన దాత నాగరాజు పిల్లలకు మెటీరియల్‌ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ చైర్మన్‌ షేక్‌ మహమ్మద్‌, లయన్స్‌ క్లబ్‌ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిండ మార్పిడి ద్వారా మేలు జాతి పశువులు



మేలు జాతి ఆవును పరిచయం చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

రాయచోటి టౌన్‌ : పిండ మార్పిడి ద్వారా మేలు జాతి పశువులు ఉత్పత్తి చేయవచ్చునని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్‌ జగన్నాథరెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి రూరల్‌ పరిధిలోని గుంటిమడుగు హరిజనవాడలో లక్ష్మమ్మ అనే పాడి రైతు పాడి పశువుకు మేలు జాతి ఒంగోలు దూడ పట్టించడం జరిగిందని చెప్పారు. ఇలా మన వద్ద ఉన్న సాధారణ పశువుల ద్వారా సంకర జాతి ఆవులను ఉత్పత్తి చేయవచ్చుని చెప్పారు. ఇలాంటి అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ మాలకొండయ్య, టెక్నికల్‌ వీఏఎస్‌ డాక్టర్‌ శశికళ, డాక్టర్‌ శివరామిరెడ్డి, డాక్టర్‌ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

బీసీలను రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర

- మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి అత్యంత హేయం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ నాయకుడు వడ్డే రమణ



రాజంపేట : బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక, ఆమె భర్త రాముపై టీడీపీ పచ్చ మూకలు దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని వడ్డెర సంఘం రాష్ట్రనేత, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్‌ అధ్యక్షుడు వడ్డే రమణ అన్నారు. సోమవారం ఆయన రాజంపేటలో మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన మహిళ ఉన్నత చదువులు చదువుకొని, ప్రజల్లో మంచి పేరు గడించిన మహిళా నాయకురాలు ఉప్పాల హారిక అన్నారు. జిల్లా ప్రథమ పౌరులు, క్యాబినెట్‌ హోదా కలిగిన చైర్‌పర్సన్‌పై ఉన్మాదుల దాడి జరుగుతుంటే పోలీసులు చోద్యం చూస్తుండటం చాలా దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నడుస్తోందా, రెడ్‌బుక్‌ రాజ్యాంగం నడుస్తోందో అర్థం కావడంలేదన్నారు. ప్రభుత్వం బీసీల పట్ల చిన్నచూపు చూడటం తగదన్నారు. బీసీ వర్గాలు రాజకీయాల్లో రాణించకూడదా అని ప్రశ్నిస్తే, రాణిస్తే వారిని అవమానపాలు చేసే విధంగా పచ్చ మూకల దౌర్జన్యకరంగా వ్యవహరించడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. బీసీలపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బలహీనవర్గాలు రాజకీయంగా అణచివేసేందుకే దాడులు జరుగుతున్నాయని, తద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు నిలబడకుండా భయభ్రాంతులకు గురిచేసే కుట్రలో భాగమే ఉప్పాల హారికపై దాడి చేయడమేనన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, అధికారుల దోషులను పట్టుకోని కఠినంగా శిక్షించాలన్నారు.

‘ఎంప్రదా’ను బెదిరించి వాటాలు తీసుకోలేదా?

- వైఎస్‌ జగన్‌ హయాంలో పార్టీల కతీతంగా మంగంపేట మైనింగ్‌ పనులు
- మీరు చేసే నిరంకుశ విధానాలను మాకు అంటగడితే చూస్తూ ఊరుకోం
- వైఎస్సార్‌సీపీ ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు సిగమాల రామచంద్రారెడ్డి



ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ నుంచి ఎంప్రదా కంపెనీ బెరైటీస్‌ ఖనిజం లోడింగ్‌ విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుమ్ములాడుకుని వైఎస్సార్‌సీపీపై బురదచల్లడం మంచి పద్ధతి కాదని రైల్వేకోడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు సిగమాల రామచంద్రారెడ్డి (సతీష్‌ రెడ్డి) విమర్శించారు. మంగళవారం మంగంపేట ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఆరు నెలలుగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎంప్రదా కంపెనీకి లోడింగ్‌ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. కాగా స్థానిక టీడీపీ నాయకుడు తనకు 25 శాతం వాటా ఇవ్వాలని కంపెనీని ఇటీవల పట్టుబట్టడం వాస్తవం కాదా? ఆ విషయమై చర్చలు చేయలేదా? చర్చలు విఫలం అవ్వడంతో శుక్రవారం సదరు కంపెనీకి డిస్పాచ్‌ చేయకుండా నిలిపివేయలేదా అని ప్రశ్నించారు. అంతేకాక తాను 25 శాతం వాటా తీసుకున్నట్టు పత్రికా విలేకరుల సమావేశంలో తెలియజేయడం సిగ్గు చేటన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా లోడింగ్‌ మిషన్లకు అవకాశం కల్పిస్తే, కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన మిషన్‌లను తొలగించడం దౌర్భాగ్యమన్నారు. ప్రస్తుతం ఎంప్రదా కంపెనీని బెదిరించి వాటాలు దక్కించుకున్న సదరు టీడీపీ నాయకుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంకర క్వారీ అనుమతులు పొంది రూ.కోట్లు సంపాదించింది వాస్తవం కాదా అనేది ప్రజలకు చెప్పాలన్నారు.

మంగంపేట నిర్వాసితులను ఆదుకుంది వైఎస్సార్‌

మంగంపేట గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 296 జీఓ తీసుకువచ్చి చిన్న పరిశ్రమలు పల్వరైజింగ్‌ మిల్లులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిలిచ్చి వేలాది మందికి జీవనోపాధి కల్పించారన్నారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీతోపాటు ఇతర పార్టీల నాయకులు మిల్లులు ఏర్పాటు చేసుకోలేదా అని ప్రశ్నించారు. అయితే ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం పార్టీ అధికారంలోకి రాగానే ఇష్టారాజ్యంగా వ్యవహరించి అన్ని తమకే కావాలని టీడీపీ నాయకులు అత్యుత్సాహం చూపిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీపై బురదజల్లే కార్యక్రమాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్తులో గట్టిగా బుద్ధి చెబుతామని సిగమాల హెచ్చరించారు.

రైతులు క్రాప్‌ ఇన్సూరెన్స్‌ ప్రీమియం చెల్లించాలి

సుండుపల్లె : పంటలు సాగు చేసిన రైతులు క్రాప్‌ ఇన్సూరెన్స్‌ ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ, టమాటా సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలన్నారు. అలా చెల్లించడం వలన ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందన్నారు. అలాగే కౌలు రైతులను గుర్తించి వీఆర్‌ఓ లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారనే విషయాలను నమోదు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ధరలకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు అందజేయడం జరుగుతుందని మైక్రో ఇరిగేషన్‌ పీడీ సాయిప్రసన్న తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ తోడ్పాటుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ మహబూబ్‌బాషా

రైతులకు కచ్చితంగా బిల్లు ఇవ్వాలి

రాజంపేట : రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌ గుంటూరు, రాష్ట్ర విజిలెన్సు అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ జనరల్‌ మంగళగిరి వారి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా అధికారుల బృందం, ఎస్పీ ఎల్లప్ప సహాయ వ్యవసాయ సంచాలకులు కల్యాణదుర్గం, అనంతపురం జిల్లా, ఎస్‌.చంద్రశేఖర్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ పోలీసు విజిలెన్సు అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ తిరుపతి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరుకులు అమ్మేటప్పుడు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్కరూ స్టాక్‌ రిజిస్టర్‌ను అప్‌డేట్‌ చేస్తూ ఉండాలని తెలిపారు. అలాగే డీబీటీలో బ్యాలెన్స్‌కు, గ్రౌండ్‌ బ్యాలెన్సు స్టాకు పరిశీలించారు. ప్రతి ఒక డీలర్‌ రైతులకు ఎరువులు కొరత రాకుండా చూడాలన్నారు. అలాగే తమ గోడౌన్‌ అడ్రస్సులు ఏవైతే ఉన్నాయో అవి జీఎస్టీలో కచ్చితంగా ఇంక్లూజన్‌ చేసుకోవాలని ఆదేశించారు. రెండు దుకాణాలలో 22.5 మెట్రిక్‌ టన్నుల డీబీటీ ఎరువులకు మొత్తం విలువ రూ.4,18,900లకు స్టాప్‌ సేల్స్‌ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే క్రాంతి ట్రాన్స్‌పోర్ట్‌లో తనిఖీ చేయడం జరిగిందన్నారు. తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానంగా ఉన్న వాటిని పరిశీలించి చూడగా అనుమతి లేని పురుగు మందులను గమనించి దానిని తదుపరి చర్యల నిమిత్తం రూ.89,110ల స్టాకుకు సీజ్‌ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో జి.నాగలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి రాజంపేట ఎస్‌.పవన్‌ కుమార్‌, టెక్నికల్‌ ఏఓ డిస్ట్రిక్ట్‌ అగ్రికల్చర్‌ ఆఫీసర్‌ రాయచోటి వారు పాల్గొన్నారు.

అటల్‌ పెన్షన్‌ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్‌ : అటల్‌ పెన్షన్‌ పథకాన్ని అర్హత కలిగిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని శిబ్యాల కెనరా బ్యాంక్‌ మేనేజర్‌ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి రూరల్‌ పరిధిలోని శిబ్యాల గ్రామంలో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సురక్ష బీమా యోజన అటల్‌ పెన్షన్‌ యోజన ప్రధాన మంత్రి జనధన్‌ యోజన అకౌంట్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలలోపు వారికి రూ.436లు చెల్లిస్తే వారికి కలిగే ప్రయోజనాలపై వివరించి చెప్పారు. అలాగే రూ.2లక్షల ప్రమాద బీమా, రూ.2లక్షల సాధారణ బీమా, అంగవైకల్యానికి రూ.లక్షల సాధారణ బీమా లభిస్తుందని చెప్పారు. అలాగే 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల ఉన్న వారు నెలకు రూ.20లు చెల్లిస్తే రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్‌ డీఆర్‌డీఏఏపీఎంఎం శ్రీనివాసులు రెడ్డి, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్‌ శివ నాగయ్య, వీఓఏ నారాయణ రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.



బీమా పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్‌ రామనాథరెడ్డి

వర్షాలు కురిపించు గంగమ్మా

గాలివీడు : వర్షాలు కురిపించు గంగమ్మఅంటూ పేరంపల్లి ఆసర్ల గంగమ్మకు పెడకంటి కొత్తపల్లి ప్రజలు మంగళవారం బోనాలను సమర్పించారు. వర్షాలు లేక రైతు పెట్టిన పంట ఎండముఖం పట్టడంతో అమ్మవారి కటాక్షం కోసం బోనాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. బోనాల కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.



ఆసర్ల గంగమ్మకు బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

‘హిందీ భాషను ద్వేషించడం సరికాదు’

పుల్లంపేట : హిందీ భాషను కొంతమంది ద్వేషించడం సరికాదని ప్రేమ్‌ చంద్‌ హిందీ భవన్‌ సొసైటీ వ్యవస్థాపకులు సయ్యద్‌ సర్తాజ్‌ హుస్సేన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టడంలో, భారతీయులందరినీ ఒకేతాటిపైకి తేవడంలో ఆనాడు హిందీ వల్లే సాధ్యమైందనే విషయాన్ని గ్రహించాలన్నారు. దేశంలో ఎక్కువ మంది ప్రజలు హిందీ భాష మాట్లాడుతున్నారని, హిందీనే జాతీయ భాషగా ముందుకు తీసుకెళ్లాలని పలువురు మాట్లాడుతుండటం అభినందనీయమన్నారు. కొన్ని రాష్ట్రాలు విదేశీ భాషలకు ఇచ్చే ప్రాముఖ్యత మన సంస్కృతిలో భాగమైన హిందీని ద్వేషించడం సరికాదన్నారు.

బిట్స్‌కు ఏఐ కోర్సు మంజూరు

రాయచోటి జగదాంబసెంటర్‌ : బండపల్లె వద్ద ఉన్న భాస్కర్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ సైన్స్‌ ఇంజనీరింగ్‌ కళాశాల(బిట్స్‌)కు ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ కోర్సు మంజూరైనట్లు కళాశాల చైర్మన్‌ మన్నూరు భాస్కర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు, దేశ రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, నిఘాల వ్యవస్థలన్నింటికీ ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ ప్రధానం కావడంతో ఏఐ కోర్సుకు డిమాండ్‌ పెరిగిందన్నారు. తమ కళాశాలకు ఏఐ విభాగంలో అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం సంతోషకరమన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి టౌన్‌ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పిసి రెడ్డెన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫైనాన్స్‌ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్‌ వ్యాలిడేషన్‌ అమెండ్మెంట్‌ను రద్దు చేయాలని, కేంద్రంలో 8వ కమిషన్‌ను, రాష్ట్రంలో 12వ పే కమిషన్‌ వెంటనే నియమించాలని కోరారు. అలాగే ఐఆర్‌ ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కేంద్ర, రాష్ట్ర పెన్షనర్ల కమ్యూనికేషన్‌ రికవరీ కాలం 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోటలో విద్యార్థుల సందడి



సిద్దవటం : మట్టి రాజుల కోట శిల్ప సంపద అద్భుతంగా ఉందని కడప పబ్లిక్‌ స్కూల్‌ కోఆర్డినేటర్‌ అనిత తెలిపారు. మండల కేంద్రంలోని మట్టిరాజుల కోటకు విహార యాత్రలో భాగంగా మంగళవారం కడప నగరంలోని కడప పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థులు, ఉపాధ్యాయులు దాదాపు 150 మంది విచ్చేశారు. ఈ సందర్భంగా వారు కోటలోని చారిత్రక కట్టడాలను తిలకించారు. కాగా విద్యార్థులతో కోటలో సందడి వాతావరణం కనిపించింది.

వాణిజ్య పంటల సాగుపై రైతుల ఆసక్తి

సిద్దవటం : సాంప్రదాయ పంటల సాగుతో విసిగిపోయిన రైతులు వాణిజ్య పంటలపై ఆసక్తి చూపుతున్నారని బద్వేల్‌ ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిద్దవటం మండలం పెద్దపల్లి రైతు భరోసా కేంద్రంలో ఆయిల్‌ పామ్‌ సాగుపైన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ పైలెట్‌ ప్రాజెక్టుగా జిల్లాలో సిద్దవటం మండలంలో 125 ఎకరాల్లో ఆయిల్‌ పామ్‌ సాగుకు శ్రీకారం చుట్టారన్నారు. బద్వేల్‌ డివిజన్‌ పరిధి సిద్దవటం మండలంలోని గ్రామాలలో సాగు చేయాలని హార్టికల్చర్‌ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆయిల్‌ పామ్‌ సాగుకు నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. కావున పెన్నానది ఒడ్డున ఉన్న సిద్దవటం మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఒక ఎకరాకు 50 మొక్కలు నాటుకోవచ్చునన్నారు. అతి తక్కువ చీడ, పీటలు ఆశించే పంట ఇది అన్నారు. అడవి జంతువులు కూడా పెద్దగా నష్టపరిచే పంట కూడా కాదని, పంట దిగుబడి వచ్చాక రైతు దగ్గరలోని కలెక్షన్‌ సెంటర్‌కు తీసుకెళితే అక్కడ నుండి రియా ఆగ్రోస్‌ ప్రతినిధులు ప్రభుత్వ నిర్ణయించిన ధరకి కొనుగోలు చేస్తుందన్నారు. ఒక హెక్టారుకు 4 సంవత్సరాలకు గాను రూ. 71,000రాయితీ రూపంలో అందుతుందని ఉద్యానాధికారి తెలిపారు.

ఆశించిన దిగుబడి

ఈ ఆయిల్‌ పామ్‌ సాగులో ఆశించిన దిగుబడితోపాటు చక్కటి లాభాలు ఉంటాయన్నారు. మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల నుంచి పంట చేతికి వస్తుందన్నారు. మొదటగా 6 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుందని, 7వ సంత్సరం నుంచి 16 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో దిగుబడులు వస్తున్నట్లు, ఒక్కొక్క టన్నుకు రూ.13వేలు ధర పలుకుతోందని ఉద్యాధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో రియా ఆగ్రో జిల్లా మేనేజర్‌ పవన్‌కుమార్‌, కంపెనీ ప్రతినిధి ధర్మసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తాళ్లపాక రహదారి విస్తరణకు సర్వే

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక రహదారి సర్వే సోమవారం నిర్వహించారు. నీటిపారుదలశాఖ జేఈ మధుసూదన్‌ ఆధ్వర్యంలో సర్వే సిబ్బంది సర్వేను సమగ్రంగా చేపట్టారు. హైవేలోని తాళ్లపాక ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు ఉన్న రహదారి విస్తరణ కోసం ఈ సర్వే చేపడుతున్నారు. సర్వేపై నివేదికను తితిదే అధికారులకు అందజేయనున్నారు. కాగా ఈ నెల7న ఈఓను గ్రామస్తులు కలిసి తాళ్లపాక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో అభివృద్ధికి సంబంధించి నివేదికలను టీటీడీ తెప్పించుకోవడం జరుగుతోంది. రహదారి అభివృద్ధిలో భాగంగా ప్రముఖుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేసే ఆలోచనతో రహదారి వెడల్పు చేయనున్నారు. నీటిపారుదల శాఖ చేస్తున్న సర్వేలో ఏఐటీఎస్‌ వైస్‌ చైర్మన్‌ చొప్పా ఎల్లారెడ్డి, మాజీ సర్పంచి తనయుడు ఉద్దండం సుబ్రమణ్యం, ప్రముఖ ఆడిటర్‌ పంత్‌ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు. టీటీడీ అధికారులు తాళ్లపాక గ్రామాభివృద్ధిపై దృష్టి సారించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్వేను పరిశీలిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

నేటి నుంచి శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 22వ జాతర మహోత్సవాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు దేవస్థానం కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. జాతరను పురస్కరించుకొని అమ్మవారి గుడిని విశేషంగా అలంకరించారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అలంకరణ, మొక్కుల సమర్పణ వంటి కార్యక్రమాలు జరుగున్నారు. రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా గుడికి చేరుతుందన్నారు. గురువారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అమ్మవారి దర్శనం, పొంగళ్లు, నైవేద్యం వంటి పూజలు జరుగునన్నారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం గ్రామ పొలిమేరలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేస్తారని చెప్పారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని అనుగ్రహం పొందాలని తెలియజేశారు.



తహసీల్దార్‌ సహపంక్తి భోజనం



పెనగలూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను తహసీల్దార్‌ అమరేశ్వరీ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనాన్ని చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు.